క్లుప్తంగా

51 మంది విద్యార్థుల గైర్హాజరు


ఆకివీడులో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

ఆకివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, బోటనీ, లెక్కల పరీక్షలు సోమవారం ఆకివీడు మండలం దుంపగడపలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పట్టణంలోని రెండు జూనియర్ కాలేజీల్లో నిర్వహించారు. మొత్తం 760 మందికి 51 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆయా సెంటర్ల డిపార్టుమెంటల్ అధికారులు తెలిపారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


గొల్లలకోడేరులో హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

పాలకోడేరు: హెల్మెట్ ధరించడం ద్వారానే ప్రాణాలను రక్షించుకోవచ్చు నని జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ అన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో వాహదారులతో హెల్మెట్లను కొనుగోలు చేయించి హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆకివీడులో భారీ వర్షం


సంతపేట ప్రాంతంలో నీట మునిగిన రోడ్డు

ఆకివీడు: పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు, డ్రెయిన్లు నీట మునిగాయి. స్థానిక సంతపేట, సాలిపేట, అమృతనగర్, మాదివాడ, ప్రధాన సెంటర్లు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల వర్షం నీరు ఇళ్లలోకి చొచ్చుకెళ్లాయి. కొంతసేపు జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. పంట పొలాల్లో వర్షం నీరు చేరడంతో నీటి సమస్య కొంత తీరింది. ఈ వర్షంతో వరి పంటకు కొంత నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మంచినీటిని ఆదా చేద్దాం


శృంగవృక్షంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ మంచినీటిపై అవగాహన కలిగి, నీటిని ఆదా చేయాలని సర్ సీవీ రామన్ పాఠశాల పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శిరీష అన్నారు. శృంగవృక్షం గ్రామంలోని సర్ సీవీ రామన్ పాఠశాల విద్యార్థులు సోమవారం మంచినీటి జలాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఇంకుడు గుంతలతో నీటిని ఆదా చేయాలని, నీటిని వృథా చేయొద్దంటూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. శిరీష మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నీరు దొరక్క కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, నీటిని పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ భాస్కరరావు, సాయిబాబా, సుంకర సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం, మాసశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు చేయించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి లీలా కల్యాణం, ముత్యాల పూజ చేశారు. అనంతరం స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యర్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో వాటర్ కూలర్ ఏర్పాటు

మొగల్తూరు: మొగల్తూరు కుక్కలవారి వీధిలో చెట్టుకింద కొలువైన ముత్యాలమ్మ ఆలయానికి అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు మధిర సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు ప్లాంట్‌ను ప్రారంభించారు. కుక్కల సత్యనారాయణ, కుక్కల నాగమల్లేశ్వరావు, కుమార్ స్వామి, రాజేష్ పాల్గొన్నారు.

ఫిష్‌ఆంధ్ర అవుట్‌లెట్స్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్) : ఫిష్‌ఆంధ్ర అవుట్‌లెట్స్ ఏర్పాటు త్వరితగతిన చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ల ఏర్పాటుపై సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బతికున్న చేపల స్టాల్స్, పెద్ద రెస్టారెంట్లు ఏర్పాటు చేయుటకు సబ్సిడీపై రుణ సదుపాయం పొందవచ్చునని ఆమె అన్నారు. ఇప్పటికే గుర్తించిన ఒక్కొక్కటి రూ. లక్ష విలువగల 214 ఫిష్ అవుట్‌లెట్స్ గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదే విధంగా రూ.10 లక్షల విలువైన యూనిట్లు 10 గుర్తించారని, రూ.20 లక్షల యూనిట్లు నాలుగు గుర్తించారని వీటిని త్వరితగతిన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఇన్‌చార్జి జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ ఎం.మురళికృష్ణ, మత్స్య శాఖ ఎఫ్డీఓలు, వీఎఫ్ఏలు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న చెరుకువాడ ప్రజలు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు అందినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. అర్హతను బట్టి కొత్త దంపతులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, యాప్‌ను అమలులోకి తీసుకురావాలని ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన బండ్రెడ్డి నిర్మల్ కుమార్ విజ్ఞప్తి చేశారన్నారు. తన స్థలంలో అక్రమంగా ఏర్పాటుచేసిన కుళాయి, డ్రెయినేజీ పైపుల తొలగించాలని దుంపగడపకు చెందిన ముత్యాల శ్రీనివాసబాబు, దుంపగడప గ్రామంలో వరి చేలకు ఇబ్బందిగా మారిన పంట కాలువ గట్టుకు చేర్చి ఉన్న రొయ్యల చెరువును తొలగించాలని ఆ ప్రాంత రైతులు అద్దేపల్లి ప్రభాకరరావు తదితరులు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కోళ్లపర్రు చానల్‌పై తూరల విషయమై రైతు జీవీఎస్ఎస్ నారాయణరాజు, కొల్లేరు సరస్సు ప్రాంతంలో సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసి కాలుష్య నివారణకు సహకరించాలని, రైల్వే ట్రాక్ వెంబడి సిద్ధాపురం, గుమ్ములూరు గేటుల వరకు బైపాస్‌రోడ్డు నిర్మించాలని ఆకివీడు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి సోమరాజు ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ వివరించారు.

చర్చి నిర్మాణంపై ఫిర్యాదు

ఉండి: చెరుకువాడలో అనుమతులు లేకుండా నిర్మిస్తోన్న చర్చి పనులను నిలిపివేయాలంటూ ఉండి మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ నడింపల్లి వెంకట్రాజు మాట్లాడుతూ గత తహసీల్దార్ కృష్ణజ్యోతికి ఫిర్యాదు చేయగా, పనులను నిలుపుదల చేశారని, గత వారం రోజుల నుంచి చర్చి నిర్మాణ పనులతో హడావిడి చేస్తున్నారని తెలిపారు. చర్చి నిర్మాణాన్ని నిలిపివేయకుంటే ఆందోళ చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ బావుల కబ్జాపై ఫిర్యాదు

పాలకోడేరు: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని రాకుండా తవ్వించిన పంచాయతీ బావులు ఆక్రమణలకు గురయ్యాయని పెన్నాడ అగ్రహారానిక చెందిన దళిత నాయకుడు కోరం ముసలయ్య ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత సర్పంచ్ మంతెన రామరాజు హయాంలో యల్లమెల్లి నరసింహ మూర్తి వార్డు సభ్యునిగా ఉన్నారని, అప్పట్లో పంచాయతీ నిధులతో బావులు తవ్వించారని, అయితే అవి ప్రస్తుతం కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి, ఆక్రమణలు తొలగించాలని కోరారు.

ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఆలయాలు


బొండాడలో డిప్యూటీ కమిషనర్‌ను సత్కరిస్తున్న దృశ్యం


ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఆలయాలను తీర్చిదిద్దుతున్నామని దేవదాయ శాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో భోగేశ్వర స్వామి, జనార్దన స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బొండాడ భోగేశ్వర స్వామి, జనార్దన స్వామి ఆలయంలో ఫ్లోరింగ్, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. దాతల సహకారంతో అర్చకులకు క్వార్టర్స్ నిర్మించే యోచన ఉందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేగేశ్న ఆంజనేయరాజు ఆలయాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను డిప్యూటీ కమిషనర్ అభినందించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

భోగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నందుల నారాయణమూర్తి, జనార్దన స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మందపాటి రాము దంపతులు స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలను అర్చకులు శర్మ , శ్రీనివాస్ చేతుల మీదుగా వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని స్వామి వార్ల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

రసవత్తరంగా జట్ల మధ్య పోటీలు


కబడ్డీ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వీరవాసరం: ఉగాది సందర్భంగా కొణితివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొణితివాడ యూత్ కబడ్డీ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. సీనియర్ కబడ్డీ ప్లేయర్ నాగరాజు భాస్కర్ రాజు చేతుల మీదుగా కబడ్డీ మూడురోజుల పోటీలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.20,000, ద్వితీయ బహుమతి రూ.12,500, తృతీయ బహుమతి రూ.7500, కన్సొలేషన్ బహుమతితో పాటు బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెన్స్, బెస్ట్ ప్లేయర్లకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మొదటగా ఆచంట - బల్లిపాడు జట్ల మధ్య, భీమవరం - వాడపల్లి జట్ల మధ్య, తాడేపల్లిగూడెం - జువ్వలపాలెం టీముల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రారంభ కార్యక్రమంలో ఉండ్రాజవరం తహసీల్దార్ ఎ.కనకరాజు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, యరకరాజు చినబాబు, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, హరిబాబు, యరకరాజు పెదబాబు, బీశెట్టి కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్, వరప్రసాద్, ప్రసన్న యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి భస్మాభిషేకం


ఉమాసోమేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంలో ఫాల్గుణ మాసం మాస శివరాత్రి సందర్భంగా ఏడాదికి ఒక్కసారే నిర్వహించే భస్మాభిషేకం (విభూది) సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కోడే ధర్మకర్తలు కోయతాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, శ్రీ తాణాల రామకృష్ణ, ఈఓ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్) : గునుపూడి భీమవరం కుమ్మర్ల పెద్ద వీధిలో వేంసించియన్న శ్రీ వీరభద్రేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం మాస శివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 500 తమలపాకులు, 4,000 మల్లె మొగ్గలతో కొమ్మిరెడ్డి వెంకట సత్యనారాయణ - వరలక్ష్మి దంపతుల సహకారంతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శనివారపు రాము స్వామివారిని అలంకరించి స్వామివారికి పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధన, సాయంత్రం సంకీర్తన నిర్వహించారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి


జిల్లాస్థాయి ఎక్స్‌పోలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వం అభివృద్ధి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. భీమవరం లూథరన్ హైస్కూల్లో సమగ్ర శిక్ష, ఎస్సీఈఆర్టీ సంయుక్తంగా ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి ఎక్స్‌పోను ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే వివిధ రకాల ప్రాజెక్టులను తయారుచేసి వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖాధికారి డి.శ్రీరామ్, వీఎం శ్యామ్‌ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, ఎం.వెంకటరమణ, ఎం .శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు


చెరుకుమిల్లి హైస్కూల్లో పనుల్ని పరిశీలిస్తున్న కె.దుర్గబాబు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులూ కల్పిస్తున్నట్టు సర్వ శిక్షఅభియాన్, విద్యా పథకాల రాష్ట్ర పరిశీలకులు కె.దుర్గబాబు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, అయిభీమవరం, చెరుకుమిల్లి గ్రామాల్లోని జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్ని సోమవారం ఆయన సందర్శించారు. నాడు - నేడు పనులు, విద్యాదీవెన, వసతి, ట్యాబ్ తదితర వాటిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నదీ లేనిదీ విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ స్కూల్‌కు యూనిఫాం వేసుకురావాలని సూచించారు. నాడు నేడు పనులు, రికార్డులను పరిశీలించారు. మరో నాలుగు గ్రామాల్లోని పాఠశాలల్ని తనిఖీ చేయాల్సుందని ఆయన చెప్పారు. ఆయన వెంట నోడల్ టీచర్ బొడ్డు రాజు, సీఆర్పీ సోడదాసి రాజకుమార్, ఎ.శాంతి, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

పిచ్చుకలను సంరక్షించుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్లో సోమవారం నిర్వహించారు. పిచ్చుకల సంరక్షణపై అవగాహన కల్పించారు. వ్యాసరచన, వకృత్వ పోటీలు జరిపారు. హెచ్ఎం జె సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి హస్ముఖ లాల్ జైన్ మాట్లాడుతూ కనుమరుగైపోతున్న పిచ్చుకలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు అలు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, శ్రీదేవి, మాధవి లత, ఇందుకూరి శివాజీవర్మ తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు


పెద్దింటమ్మ హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఆకివీడు: ఆలయాల హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించామని ఆలయాల కార్యనిర్వాహణాధికారి రంగరాజు తెలిపారు. స్థానిక పెద్దింటమ్మ ఆలయ హుండీ నాలుగు నెలల ఆదాయం రూ.1,60,525, వనువులమ్మవారి ఐదు నెలల హుండీ ఆదాయం రూ.53,710, పిల్లలమర్రి అగ్రహారం వెంకట లింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ. 56,116 వచ్చినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో శృంగవృక్షం దేవస్థానాల ఈఓ మంతెన నర్సింహరాజు, పెద్దింటమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, డైరెక్టర్ కుంకట్ల దానయ్య, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సేల్స్ మెన్‌పై దాడి

కాళ్ల: మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్ మెన్‌పై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. ముత్యాల శివ రంగారావు కాళ్లలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్ మెన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మిగిలిన వర్కర్స్‌తో కలిసి అమ్మకాలు, స్టాక్ వివరాలు పరిశీలిస్తుండగా కొందరు వ్యక్తులు వచ్చి బీర్లు అడిగారు. వాటితోపాటు ఖాళీ బాక్స్ కావాలని అడగడంతో లేదని చెప్పిన తనపై ఆకివీడుకు చెందిన రఘురావు, సాయి, యువరాజు, ప్రసన్న, ప్రసాదు దాడి చేసి పక్కనే ఉన్న ప్లాస్టిక్ ట్రే తో తలపై కొట్టి గాయపరిచాడని బాధితుడు ఫిర్యాదు ఇచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మూర్తి తెలిపారు.

వ్యక్తిపై దాడి

ఆకివీడు: స్థానిక శాంతినగర్ శివారు ఖాళీ ప్రదేశంలో ప్రార్థన చేసుకుంటున్న తనపై దాడి చేశారని కైకలూరు మండలం సీతనపల్లి గ్రామానికి చెందిన కట్టా జాన్ వెస్లీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు తనను, తన భార్యను శాంతినగర్‌లోని గంధం ఉమా అనే అతని వద్దకు తీసుకువెళ్లగా రాడ్డుతోతనను కొట్టి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు కె.రాజారెడ్డి తెలిపారు.

గొల్లలకోడేరులో ఫ్యామిలీ డాక్టర్

పాలకోడేరు: నెలకు రెండుసార్లు నిర్వహించే ఫ్యామిలీ ఫిజిషన్ క్యాంప్‌ను సద్వినియోగపరచుకోవాలని పాలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ రంగం నాయుడు అన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. మధుమేహ రోగులను హైపర్ టెన్షన్‌కు గురైన వ్యక్తులను పరీక్షించి మందుల అందించారు. రోగులకు హెల్త్ ఎడ్యుకేషన్ నిర్వహించారు. సమయానికి పోషకాహారం తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీహెచ్ఓ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ మాణిక్యవల్లి, ఆరోగ్య సహాయకుడు శ్రీను, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ

ఉండి: మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావను అందిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కాగానే తాము కూడా విద్యార్థులకు రాగిజావ అందిస్తామన్నారు. వారానికి మూడు సార్లు ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావను అందిస్తామని తెలిపారు.

రేపు పద్మశ్రీ సుంకరకు సన్మానం

సాక్షి, భీమవరం : ఉగాది సందర్భంగా ఈనెల 22వ తేదీన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణరావుకు సుంకర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. భీమవరం టౌన్‌హాల్‌లోని ఫంక్షన్ హాల్లో బుధవారం సాయంత్రం 5 గంటలకు సన్మానించనున్నట్లు చెప్పారు.